క్లుప్తంగా

ఉత్సవ విగ్రహం బహూకరణ



తెనాలి: శ్రీకృష్ణాష్టమి సందర్భంగా దుగ్గిరాలలోని యాదవపాలెంలోని శ్రీకృష్ణ మందిరానికి స్వామివారి ఇత్తడి ఉత్సవ విగ్రహాన్ని ఆ గ్రామానికి చెందిన కాకా మహేష్, మాధవి దంపతులు బహూకరించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, హోమం జరిపించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

నేడు ప్రజా సమస్యలపై పరిష్కార వేదిక

తెనాలి అర్బన్: తెనాలి పురపాలక సంఘ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికను పట్టణవాసులందరూ ఉపయోగించుకోవాలని మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ వీఎం.లక్ష్మీపతిరావు ఒక ప్రకటనలో సూచించారు. తాగునీటి సమస్య, రోడ్లు, కాలువలు, ఇతర మౌలిక వసతులకు సంబంధించిన సమస్యలను పరిష్కార వేదికలో తెలియజేయవచ్చని ఆయన అన్నారు. సోమవారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ఇంజినీరింగ్ విద్యార్థినికి ల్యాప్‌టాప్ వితరణ



తెనాలి అర్బన్: యంగ్ జనరేషన్ టీమ్ వ్యవస్థాపకుడు షేక్ సాధిక్ ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ చదువుతున్న తెనాలికి చెందిన హాసినికి ల్యాప్‌టాప్‌ను ఆదివారం ఉచితంగా అందించారు. తమ సంస్థ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలను నిర్వహించినట్లు సాధిక్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. కార్యక్రమంలో టీమ్ సభ్యులు నవీన్, శివ, విద్యార్థిని తండ్రి చంద్రకాంత్ పాల్గొన్నారు.

కాలభైరవస్వామి విగ్రహ ప్రతిష్ట



తెనాలి: రూరల్ మండలం పెదరావూరు గ్రామంలోని శ్రీగంగా భ్రమరాంబ సహిత శ్రీమల్లేశ్వరస్వామి ఆలయంలో శ్రీకాలభైరవ స్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. శ్రీసిద్దేశ్వరానంద భారతీ మహాస్వామి ఆశీస్సులతో పెదరావూరుకు చెందిన పాటిబండ్ల కోటేశ్వరరావు, రవిచంద్రిక దంపతుల సహకారంతో ఈ ప్రతిష్టను చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఎ.శ్యామ్‌సుందర బాబు, ఆలయ ప్రధాన పూజారి చావలి శ్రీనివాసరావు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

గంజాయి విక్రేతల అరెస్ట్

తెనాలి రూరల్: గంజాయి విక్రయిస్తూ తాగుతున్న వారిని పోలీసులు అరెస్ట్ చేశారు. త్రీ టౌన్ సీఐ ఎస్.రమేష్‌బాబు, ఎస్‌ఐ షేక్ కరిముల్లాకు వచ్చిన సమాచారం మేరకు తమ సిబ్బందితో కలిసి పట్టణ మారిస్‌పేట నుంచి చుండూరు మండలం చినపరిమికి వెళ్లే మార్గంలో ఆదివారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. గంజాయి విక్రయిస్తూ, తాగుతున్న 8 మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి 1,700 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులు తెనాలి, గుంటూరు, పొన్నూరుకు చెందిన వారని పోలీసులు తెలిపారు.

కనులపండువుగా గంగానమ్మ తల్లి కొలుపులు



తెనాలి టౌన్: శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి భక్త బృంద సేవా సమితి రజక యూత్ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణ రజకచెరువు వద్ద గంగానమ్మ తల్లి కొలుపులు అత్యంత వైభవంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ తెనాలి నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పాల్గొని అమ్మవారిని దర్శించుకుని పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. భక్తుల మనోభీష్టాలు నేరవేర్చే గంగానమ్మతల్లి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని శివకుమార్ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ వీఎం.లక్ష్మీపతిరావు, జలగం రామకృష్ణ, మల్లిబోయిన రాము, కుర్రా శ్రీను, మీరావలి, పెసర్లంక రమణ, మున్నిపల్లి వంశీ, ఎన్ఆర్‌కే శర్మ, బేతపూడి పవన్‌కుమార్, ప్రవీణ్, కొండా, పలువురు రజక యువత సభ్యులు పాల్గొన్నారు.

రోడ్లో రామచంద్రా!

- గుంతలమయంగా రహదారులు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- కనీస మరమ్మతులకు నోచుకోని తటాకాలు



వీఎస్సార్ కాలేజీ నుంచి బాలాజీరావుపేటకు వెళ్లే రహదారి



కఠెవరం నుంచి కోపల్లె వెళ్లే రహదారి దుస్థితి

తెనాలి టౌన్: తెనాలి పట్టణ, మండలంలోని పలు రహదారులు గుంతలమయంగా దర్శనమిస్తున్నాయి. నిత్యం వాహనాల రద్దీగా ఉండే ఆ ప్రాంతాల్లో ఆర్అండ్ బీ, పంచాయతీ రహదారుల్లో గుంతలు ఏర్పడి తటాకాలుగా మారాయి. దీంతో వర్షాకాలం వాహనదారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పట్టణ నాలుగు లైన్ల రహదారి వీఎస్సార్ కాలేజీ వంతెన నుంచి బాలాజీరావుపేటకు వెళ్లే దారిలో వంతెనల మధ్య గల రహదారి భారీగా గుంతలతో దర్శనమిస్తోంది. ఇరిగేషన్ కెనాలపై నివసించే ప్రజలు, వాహనదారులు వర్షం పడినప్పుడు ఆ గుంతల్లో పడి గాయాలపాలవుతున్నారు. ఈ రహదారికి ఇరువైపులా ప్రభుత్వ కార్యాలయాలు, డీఎస్పీ కార్యాలయం, ఐసీడీఎస్ ప్రాజెక్టు ఉన్నాయి. రహదారికి అనుకుని చిన్న లారీల స్టాండ్ కూడా ఉంది. భారీ వర్షాలు కురిసినప్పుడు ఈ ప్రాంతంలోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

అమలు కాని ఆచరణ..

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రహదారులు బాగు చేశామని గొప్పలు చెప్పడం మినహా ఆచరణలో అమలు చేయడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ రహదారిని బాగు చేయాలని.. గుంతలు పూడ్చాలని ఎన్నిసార్లు అధికారులకు విన్నవించినా వారు పట్టించుకోవడం లేదని అక్కడి ప్రజానీకం విమర్శిస్తున్నారు. ఇరిగేషన్ కెనాల్‌పై నివాసించే నిరుపేదల పిల్లలు రోడ్డుపైకి వచ్చి ఆడుకుంటూ అనేకమార్లు గుంతల్లో పడి ప్రమాదాల బారిన పడిన సందర్భాలు లేకపోలేదు.

ఇబ్బందులు పడుతున్న రైతులు, విద్యార్థులు..

రూరల్ మండలం కఠెవరం రైల్వేగేటు నుంచి కోపల్లె వెళ్లే పంచాయతీరాజ్ రహదారి గుంతలమయంగా మారింది. దాదాపు మూడు కిలో మీటర్ల మేర రహదారి అడుగడుగునా గుంతలతో దర్శనమిస్తోంది. తెనాలి, కఠెవరం, కోపల్లె, గుడివాడ, కొలకలూరు గ్రామాలను కలుపుతూ ఉన్న ఈ రహదారిపై వాహనదారులు రోజూ వెళుతుంటారు. రైతులు ట్రాక్టర్‌లతో ఈ రహదారి గుండా తమ వ్యవసాయ అవసరాలను వినియోగిస్తుంటారు. పలు ప్రైవేట్ పాఠశాలలకు చెందిన బస్సులు రోజూ ఈ దారి నుంచే వెళుతుంటాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వేసిన రహదారి మినహా కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రహదారిపై ఏర్పడిన గుంతలకు కనీస మరమ్మతులు కూడా చేయలేదు. సంబంధిత అధికారులు స్పందించి రహదారి నిర్మాణాన్ని చేపట్టాలని ఆయా గ్రామాల రైతులు, వాహనదారులు కోరుతున్నారు.

సంప్రదాయాలకు ప్రతీక జన్మాష్టమి వేడుక

మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



గుడివాడలో ఉట్టికొడుతున్న మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని



కఠెవరంలో కర్ణాటక కళాకారుల నృత్య ప్రదర్శన



స్టేషన్ రోడ్డులో కోలాటం ఆడుతున్న చిన్నారులు

తెనాలి టౌన్: తెలుగు ప్రజల సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక శ్రీకృష్ణ జన్మాష్టమి పండుగ అని వైఎస్సార్‌సీపీ తెనాలి నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. ఆదివారం రూరల్ మండలం గుడివాడ గ్రామంలో మాజీ ఎంపీపీ, పార్టీ మండల అధ్యక్షుడు చెన్నుబోయిన శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కృష్ణాష్టమి వేడుకల్లో ఆయన పాల్గొని స్వామివారికి పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదానం కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. ఉట్టికొట్టే కార్యక్రమంలో పాల్గొని సందడి చేశారు. ధర్మానికి, న్యాయానికి అండగా నిలిచిన శ్రీకృష్ణ భగవానుడు చూపిన సత్యం, ధర్మం ప్రతి ఒక్కరూ పాటించాలని సూచించారు. కార్యక్రమంలో దేశబోయిన గోపి, పృథ్వీ, కోటయ్య, ధరణి, పాండురంగారావు, నల్లగొర్ల వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు. మండలంలోని కఠెవరం గ్రామంలో నిర్వహించిన జన్మాష్టమి వేడుకల్లో శివకుమార్ పాల్గొన్నారు. ఎంపీటీసీ మైలా భానుప్రసాద్, మాజీ సర్పంచ్ గంపల శివనాగేశ్వరరావు ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. కర్ణాటకకు చెందిన కళాకారుల నృత్య ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నారు.

జన్మాష్టమి వేడుకల్లో అలరించిన కోలాటం

తెనాలి టౌన్: శ్రీ కృష్ణ జన్మాష్టమి సందర్భంగా స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులో శ్రీకృష్ణ మందిరం వద్ద స్వామివారికి భక్తులు విశేష పూజలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ కో-ఆప్షన్ సభ్యులు బచ్చనబోయిన శ్రీనివాసరావు, బీసీ నాయకులు మేడిబోయిన గంగాయాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం మందిరం వద్ద ఉట్టికొట్టే కార్యక్రమం, కోలాట ప్రదర్శన నిర్వహించారు. మంచికలపూడి గ్రామానికి చెందిన కోలాట సమాజం పాల్గొని ప్రదర్శన నిర్వహించారు. చిన్నారుల కోలాట ప్రదర్శన ఆహుతులను ఆకట్టుకుంది. అనంతరం ఉట్టికొట్టే కార్యక్రమం నిర్వహించారు. యువత పెద్ద సంఖ్యలో పాల్గొని సందడి చేశారు. కోలాట సమాజం ఆర్గనైజర్లు లంక వెంకటేశ్వర్లు, కె.నాగకుమారి, పలువురు భక్తులు పాల్గొన్నారు.

అవోపా ఆధ్వర్యంలో పేదలకు పెన్షన్లు పంపిణీ



పేదలకు పెన్షన్ అందజేస్తున్న డాక్టర్ శ్రీనివాస్, తటవర్తి రాంబాబు, కేవీ బ్రహ్మం

గుంటూరు ఎడ్యుకేషన్: అరండల్‌పేటలోని ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్(అవోపా) కార్యాలయంలో పేదలకు పెన్షన్, నిత్యావసరాలు ఆదివారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి అవోపా గుంటూరు శాఖ అధ్యక్షుడు కేవీ బ్రహ్మం అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ పోలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ అవోపా ఆధ్వర్యంలో ప్రతినెలా 108 మంది పేదలకు రూ.500 చొప్పున పెన్షన్ అందజేయడం అభినందనీయమని అన్నారు. పెన్షన్‌తో పాటు రూ.వెయ్యి విలువ చేసే నిత్యావసరాలు, విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ చేయడం మంచి పరిణామమని చెప్పారు. అవోపా నిర్వహించే సేవా కార్యక్రమాలకు తన వంతు సహకారాన్ని అందిస్తానని తెలిపారు. అనంతరం వృద్ధులకు ఆరోగ్య పరిరక్షణ కోసం పలు సూచనలు అందించారు. అవోపా రాష్ట్ర అధ్యక్షుడు తటవర్తి రాంబాబు మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణలో అవోపా ఎల్లప్పుడూ ముందంజలో ఉంటుందని, పేదలకు ఆదుకోవడంతో పాటు వారి ఉన్నతికి వివిధ రకాల కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు వివరించారు. అవోపా శాఖల ద్వారా విద్య, వైద్యం, ఉపాధి అంశాల్లో రాష్ట్రస్థాయిలో వివిధ పథకాలు చేపడుతున్నామని, వచ్చే నెలలో పేద విద్యార్థులకు రూ.40 లక్షలు ఉపకార వేతనాలు ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అవోపా గుంటూరు శాఖ కోశాధికారి మహంకాళి శ్రీనివాసరావు, ప్రోగ్రాం కోఆర్డినేటర్ మద్ది సాయి రమేష్, ఊటుకూరు నాగేశ్వరరావు, కోటి స్వామి గుప్తా, వెంకట్రావు, మద్ది కోటిరత్నం పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత



తాడేపల్లిరూరల్ : ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అనారోగ్య బాధితులకు తాడేపల్లి పట్టణ అధ్యక్షుడు వల్లభనేని వెంకటరావు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాడేపల్లి 13వ వార్డుకు చెందిన షేక్ హుస్సేనమ్మకు రూ.75,406, 3వ వార్డుకు చెందిన వనమా స్వర్ణలతకు రూ.21,984, 18వ వార్డుకు చెందిన మొగలి శ్రీనుకు రూ.25,541, 20వ వార్డుకు చెందిన నమ్మి రజనికి రూ.29,247, కుంభ నాగమణికి రూ.35,000, 22వ వార్డుకు చెందిన సిద్ధు పుష్పసాయికి రూ.20,464, వసూరి రవికుమార్‌కు రూ.40,350 అందజేశామని తెలిపారు. అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నిరుపేదలకు సీఎం సహాయనిధి ఆర్థిక భరోసా ఇస్తోందని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఇట్టా భాస్కర్, కాకుమాను కుమార్, కాటాబత్తుని నిర్మల, శివ, నాగేశ్వరరావు, షేక్ సైదా, గోలి జోజమ్మ, సుధాకర్, గిరీష్ తదితరులు పాల్గొన్నారు.

అత్తింటి వేధింపులతో వివాహిత ఆత్మహత్య

లక్ష్మీపురం: అత్తింటి వేధింపులతో ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై ఆదివారం అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. ప్రకాశం జిల్లా యర్రగొండబాలెం గ్రామానికి చెందిన వినీత, కవలకుంట్ల గ్రామంలో ఆశ వర్కర్‌గా పని చేస్తోంది. ఐదేళ్ల క్రితం చాపల మడుగు గ్రామానికి చెందిన పల్లె నెహెమియా అనే వ్యక్తితో వివాహం చేసుకుంది. వీరికి ఇద్దరు సంతానం. అయితే భర్త నెహెమియా వివాహం అయినప్పటి నుంచి చిన్న చిన్న విషయాలకు గొడవ పడుతు వేధింపులకు గురి చేస్తుంటాడు. అయితే భర్త వేధింపులతో పాటు అత్త, మామలు నిత్యం అధిక కట్నం తీసుకు రమ్మని మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురి చేస్తుంటారు. దీంతో గత కొన్ని రోజు ల క్రితం అత్తింటి నుంచి గుంటూరు అరండల్ పేటలోని బాధితురాలు వినీత సోదరి ఇంటికి వచ్చి ఉంటు, మానసికంగా బాధపడుతూ పలు రకాల బిళ్లలు మింగి ఆత్మహత్యకు పాల్పడింది. దీన్ని గమనించిన కుటుంబ సభ్యులు కొత్తపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న అరండల్ పేట పోలీసులు ఘటనా స్థలంలో వినీత సోద రి కె.రోజలత ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేదలకు పండ్లు పంపిణీ

ఫిరంగిపురం: ఏపీడబ్ల్యూజే ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని ఆరోగ్యనగర్ ఎంపీపీ పాఠశాలలో ఏపీడబ్ల్యూజే సభ్యులు ఆదివారం మొక్కలు నాటారు. పేదలకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజే సభ్యులు శౌరయ్య, జి.వెంకట్, ఎం.శ్రీనివాసరావు, పాఠశాల హెచ్ఎం పి.ప్రసాద్ పాల్గొన్నారు.

ఈమని పీఏసీఎస్ అధ్యక్షుడిగా బుల్లియ్య



దుగ్గిరాల: ఈమని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం అధ్యక్షుడిగా కొమ్మూరి బుల్లియ్య ప్రమాణస్వీకారం చేసి పదవీ బాధ్యతలు చేపట్టారు. ఆదివారం ఈమని గ్రామంలో అధ్యక్షుడిగా కె.బుల్లియ్య, డైరెక్టర్లుగా గోపిశెట్టి శ్రీను, తాడిబోయిన శ్రీనివాసరావు ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం వారిని ఎంపీపీ షేక్ జబీన్ పుష్పగుచ్ఛం అందించి సన్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఉజ్వల హరిణి, కె.శ్రీ అనిత, వి.ఝాన్సీరాణి, పి.సాయి చైతన్య తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు క్రీస్తు సువార్త అవగాహన సదస్సు

దుగ్గిరాల: సమాజంలోని పిల్లలు బాధ్యతగా ఉండాలని లెఫ్టినెంట్ కల్నల్ గేరా థామస్ అన్నారు. ఆదివారం ఈమని గ్రామంలోని సాల్వేషన్ ఆర్మీ చర్చిలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన 27 సంఘాల పిల్లలకు ప్రాజెక్టర్ ద్వారా క్రీస్తు బోధనలపై అవగాహన కల్పించి, అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పి.కోటయ్య, కె.వేంకట్రావు, బి.జెనర్జీ, సుజాత, సియోన్ కుమారి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం కార్మికుల సమస్యను పరిష్కరించాలి



తాడేపల్లిరూరల్ : కూటమి ప్రభుత్వం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యను పరిష్కరించాలని యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని ఆయన నాయకులు సూర్యప్రకాశరావు, దానయ్యలతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులు గత 257 రోజులుగా దీక్షలు నిర్వహిస్తున్నా ముఖ్యమంత్రి చంద్రబాబు గానీ, మంత్రి, స్థానిక ఎమ్మెల్యే నారా లోకేష్ గానీ స్పందించకపోవడం దారుణమని అన్నారు. యాజమాన్యంతో చర్చలు జరిపి కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కార్మికులు నవనీతమ్మ, శివమ్మ, గంగాధర్‌రావు, ఇస్మాయిల్, దేవరాజు పాల్గొన్నారు.

తబలా ఆర్టిస్టు సాంబిరెడ్డికి సత్కారం



సాంబిరెడ్డిని సత్కరిస్తున్న గాయినులు

తెనాలి: పట్టణానికి చెందిన సంగీత సంస్థ శ్రీవెంకటేశ్వర అన్నమాచార్య సంకీర్తన బృందం ఆధ్వర్యంలో తబలా ఆర్టిస్ట్ సాంబిరెడ్డిని ఆదివారం స్థానిక శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో ఘనంగా సత్కరించారు. సంకీర్తన బృందంలోని కొండపి వసుంధర శిష్య బృందం ఈనెల 11న విజయవాడ సప్తగిరి దూరదర్శన్ కేంద్రంలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా దేశభక్తి గీతాలు, శ్రీకృష్ణాష్టమి పర్వదిన భక్తిగీతాలను ఆలపించారు. ఆగస్టు 15న దేశభక్తి గీతాలు, 16న భక్తిగీతాలను దూరదర్శన్ ప్రసారం చేసింది. ఆయా గీతాలకు వాయిద్య సహకారం అందించిన దుండిపాలెంకు చెందిన తబలా ఆర్టిస్టు సాంబిరెడ్డిని గాయనీ బృందంలోని ఎస్.దేవిలలిత, జి.యశస్విని, వి.తేజ తులసి, ఎ.మౌల్యశ్రీ, ఎన్.భావన, ఎం.హరిప్రియలు సత్కరించారు. ఆలయ అర్చకుడు రొంపిచర్ల మారుతి చక్రవర్తి పిల్లలకు వేద ఆశీర్వచనం ఇచ్చారు. కార్యక్రమంలో సంస్థ కన్వీనర్ కొండపి శ్రీనివాసరావు, సంకీర్తన గురువు కొండపి వసుంధర, సభ్యులు కేశవరావు, తల్లం సావిత్రి, కారంపూడి రమాదేవి, వీరిశెట్టి రజిని పాల్గొన్నారు. శ్రీవెంకటేశ్వర అన్నమాచార్య సంకీర్తన బృందం ప్రతి ఆదివారం సాయంత్రం 6 గంటల నుంచి అన్నమాచార్య కీర్తనలు, దేశభక్తి గీతాలను ఉచితంగా నేర్పిస్తున్నట్లు శ్రీనివాసరావు తెలిపారు. ఆసక్తి గలవారు 92464 40685 సంప్రదించాలని కోరారు.

ముంపు పంటలను కాపాడాలి



నీట మునిగిన పంటచేలల్లో నాయకులు, రైతులు

తెనాలి: దేవరపల్లి అగ్రహారం భూములకు మురుగు నీటి కాలువలను పునరుద్ధరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎస్.భావనారాయణ డిమాండ్ చేశారు. ఆదివారం తెనాలి రూరల్ మండలం గుడివాడకు చెందిన రైతులతో కలిసి ఆయన ముంపునకు గురైన పంట పొలాలను సందర్శించారు. ఈ సందర్భంగా రైతులు మురుగు కాలవను కోల్పోవడంతో పంట కాలువలకు వచ్చిన ముప్పును ఆయన దృష్టికి తీసుకువచ్చారు. కొలకలూరు-తెనాలి మధ్య దక్షిణ మధ్య రైల్వే మూడో రైల్వే లైన్ నిర్మాణం చేసేటప్పుడు మురుగు కాలువ తూములు ఊడిపోయాయని పేర్కొన్నారు. దీంతో 125 ఎకరాలకు పైగా అగ్రహారం భూములు మురుగు నీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివ సాంబిరెడ్డి మాట్లాడుతూ.. సమస్యను తెనాలి సబ్ కలెక్టర్ దష్టికి తీసుకువెళ్లేందుకు సోమవారం తెనాలి రావాల్సిందిగా రైతులను కోరారు. రైతులు, కౌలు రైతులు తమ్మ శివరాం, నాగుబోయిన సుబ్రహ్మణ్యం, కడియాల శివరామ బ్రహ్మం, నాగుబోయిన హనుమంతరావు, శివయ్య, గోపతోటి జకరయ్య, కప్పల వెంకటేశ్వరరావు, గుంపెన రత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ముత్యాలమ్మతల్లి జాతర



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు, రాష్ట్ర కార్యదర్శి నిమ్మకాయల రాజనారాయణ

గుంటూరు రూరల్: మండలంలోని స్వర్ణభారతినగర్‌లో కొలువైఉన్న శ్రీ ముత్యాలమ్మతల్లి జాతర మహోత్సవాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కనుల పండువగా నిర్వహిస్తున్నారు. ఆదివారం కార్యక్రమంలో భాగంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ప్రత్యేక పూజల్లో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు, రాష్ట్ర కార్యదర్శి నిమ్మకాయల రాజనారాయణ, మాజీ ఆర్అండ్‌బీ డైరెక్టర్ పిల్లి మేరిలు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి కృపతో ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు నేతలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.


భక్తిశ్రద్ధలతో కొలుపుల మహోత్సవం



ప్రత్యేక అలంకారంలో అమ్మవారు

గుంటూరు రూరల్: మండలంలోని ఏటుకూరు గ్రామంలో వేంచేసియున్న ఆళ్ళ వారి శ్రీ తినంకమ్మతల్లి కొలుపుల మహోత్సవం రెండవరోజు ఆదివారం కొనసాగింది. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం ప్రత్యేక పూజలు, హోమాలు, వ్రతాలను నిర్వహించారు. భక్తులు అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు. కార్యక్రమాల్లో భాగంగా తెల్లవారుఝామున దేవర ఇంటినుంచి అమ్మవారి ఊరేగింపు కార్యక్రమం జరుగుతుందని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. సోమవారం అమ్మవారికి మహా పొంగలి కార్యక్రమం, సాయంత్రం అమ్మవారి తీర్థ ప్రసాదం అన్నసంతర్పణ జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఆకాంక్షించారు.

30న విజయవాడలో సంచార, విముక్త జాతుల మహాసభ



స్ఫూర్తి పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీజేపీ నేతలు

గుంటూరు మెడికల్: విజయవాడలో ఈనెల 30న సంచార, విముక్త జాతుల మహాసభ నిర్వహించనున్నట్లు బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్ నారాయణ తెలిపారు. ఆదివారం స్థానిక చంద్రమౌళీ నగర్‌లోని పార్టీ కార్యాలయంలో ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు తుల్లిమిల్లి రామకృష్ణ ఆధ్వర్యంలో కరపత్రాలను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సంచార సమాజంలో వివిధ సంచార సంఘాలు, మేధావులు నాయకులు కుల పెద్దలు యువత మహిళలు అందరు 'స్ఫూర్తి' కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు మాట్లాడుతూ సంచార సమాజం ఆత్మగౌరవం, చరిత్ర, త్యాగం పోరాటపటిమ, ఎదుర్కొంటున్న సమస్యలు సమాజానికి, ప్రభుత్వాలకు, అధికారులకు తెలిసే విధంగా ఒక పెద్ద పండుగలా విజయవాడలో నిర్వహిస్తున్న స్ఫూర్తి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాలపాటి రవికుమార్, చరక కుమార్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శులు బజరంగ్ రామకష్ణ, దేసు సత్యనారాయణ, తోట శ్రీనివాసరావు, జిల్లా ఉపాధ్యక్షులు మంత్రి సుగుణ, కార్యదర్శి నారాయణరెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి మోతే శేషగిరి, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు దారా అంబేద్కర్, జిల్లా కార్యవర్గ సభ్యురాలు రమాదేవి, నాయకులు బండారుపల్లి రోశయ్య, పడమట రాధాకృష్ణ పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
90102 23706 (తెనాలి, వేమూరు, రేపల్లె)
99122 25447 (తెనాలి)
Office mail : sakshigntadvt@gmail.com